శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## వైభవంగా శ్రీవేణుగోపాలస్వామి వారి సన్నిధిలో హనుమజ్జయంతి వేడుకలు



**బుచ్చి మే 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెంలోని ముంబాయి రహదారిలో శ్రీవేణుగోపాలస్వామి వారి సన్నిధిలో శ్రీ అభయాంజనేయస్వామి వారికి హనుమజ్జయంతి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు,అభిషే కాలు,సహ స్రనామార్చ నలు నిర్వహించారు .శనివారం ప్రత్యేక పూజలు,స్వామి వారికి ఆకుపూ జ,సాయంత్రం గ్రామోత్సవం ఉంటాయని ఆలయ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి గోవిందయ్య , కార్యక్రమ పర్యవేక్షకులు తన్నీరు నారాయణస్వామి తెలియజేశారు. అలాగే మద్యహ్నం అన్నదానం కూడా ఉంటుందని భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రలు కావాలని పిలుపునిచ్చారు.

## పురుషామృగవాహనంపైన కామాక్షితాయి



బుచ్చి మే 31 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారు పురుషా మృగవాహనంపైన భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద పాల్గొని అమ్మవారిని స్వామి వారిని దర్శించు కున్నా యి.పురుషామృగవాహనం గ్రామంలో తిరిగితే గ్రామం పాడి పంటలతో కళకళలాడుతుందని ప్రజల అపాన మ్మకం.ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా వారణాశి నాగభూషణం శర్మ, ఉమాదేవి వ్యవహారించారు. కార్యక్రమాలను ఆలయ ఇఒ విరుపార్ఝుల గిరికృష్ణ పర్యవేక్షించారు.

## కావలి ముసునూరు టోల్‌పాజా వద్ద వాహనాల తనిఖీలలో 3 కేజిల బంగారు బిస్కెట్లు పట్టివేత



**కావలి, మే 31 ప్రభాతవార్త** కావలి ముసునూరు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం తెల్లవారుజామున కావలి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు గౌడ్, పోలీస్ సిబ్బంది నిర్వహించిన వాహనాల తనిఖీలలో 3 కేజిల బంగారు బిస్కెట్లు పట్టుకున్నారు. వీటి విలువ సుమారు 2 కోట్ల 50 లక్షల రూపాయలు వుంటుందని పోలీసులు తెలిపారు. కావలి రూరల్ సిఐ శ్రీనివాసరావు గౌడ్ సమాచారం మేరకు వివరాలు ఇలావున్నాయి. చెన్నైకు చెందిన ఆషిష్ కుమార్, కమలేష్‌లు కారులో 2.948 గ్రాముల బంగారు బిస్కెట్లు తీసుకెళ్తున్నారు. ముసునూరు టోల్ ప్లాజ్ వద్ద నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలలో వారి కారును తనిఖీ చేశారు. కారులో వున్న 2.948 గ్రాముల బంగారు బిస్కెట్లు పట్టుకుని సీజ్ చేసినట్లు కావలి రూరల్ సిఐ శ్రీనివాసరావు గౌడ్ తెలిపారు. నిన్నగాక మొన్న ఇదే టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలలో 2 కోట్ల 61 లక్షల 49 వేల 500 రూపాయలు విలువ చేసే నగదు, బంగారు బిస్కెట్లు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ రోజు 2 కోట్ల 10 లక్షల రూపాయలు విలువ చేసే బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు రోజులలో కావలిలో జరిపిన వాహనాల తనిఖీలలో పెద్దమొత్తంలో నగదు, బంగారు బిస్కెట్లు పట్టుపడటం జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది.

## ఘనంగా స్వామివారికి సింధూర పూజ



**కోవూరు, మే 31ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీ రాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి సింధూరంతో మహిళా భక్తులచే ప్రత్యేక పూజలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచా ర్యులు ఈ సింధూరం పూజ యొక్క విధానాన్ని మహిళా భక్తులకు వివరించారు. ఈ పూజ చేయడం వలన వచ్చే ఫలితాలను కూడా వారికి పూర్తిస్థాయిలో వివరించేలా చర్యలు తీసుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రుత్వికులు జయప్రకాష్ స్వామి, సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## 3వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్



**నెల్లూరు అర్బన్,మే31,ప్రభాతవార్త** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు శాంతియుతంగా,ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ ఉదయం 6గంటల నుండి 6వ తేదీ సాయంత్రం 6గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ హరినారాయ ణన్ ఒక ప్రకటనలో తెలిపారు.జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు రోజు, లెక్కింపు ముందు రోజు,లెక్కింపు తర్వాత రోజు రెండు రోజులపాటు భారత ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడటం,చట్ట విరుద్దమైన సమావేశాలు,బహిరంగ సమావేశాలు నిర్వహించ కూడద న్నారు.జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా యంత్రాం గానికి సహక రించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## 5న స్వయంభూ శ్రీసుబ్రహ్మణ్య స్వామి వారి నూతన ఆలయ ప్రధమ వార్షికోత్స వేడుకలు

**ఉలవపాడు, మే31, ప్రభాతవార్త** ఉలవపాడులోని స్వయంభూ శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి దేవస్థానంలో ఈనెల 5నుండి శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి నూతన ఆలయ ప్రధమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు దాచగల్లు గోపికృష్ణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీ ఉదయం 6గంటలకు మహాగణపతి పూజ, 7గంటల నుండి 10గంటల వరకు పంచామృత అబిషేకం, 10.30గంటల నుండి 12 గంటల లోగా విగ్రహ ప్రతిష్ఠ దాతలు రాచగల్లు కృష్ణారావు- వరలక్ష్మీ దంపతులు, కుమారుడు గోపికృష్ణ స్వామి వారి ఆద్వర్యంలో కళ్యాణమహోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఉదయం 9గంటలకు కోలాట ప్రదర్శన శ్రీకన్యకాపరమేశ్వరి ట్రూప్ ఉలవపాడు వారిచే నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12గంటలకు మంగమూరి సురేష్‌రెడ్డి(కావలి), గోలి ప్రభాకర్(ఉలవపాడు), ఎం.ఈశ్వర్(శ్రీనివాస టెక్స్‌టైల్స్)దాతల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

## తూర్పు కంభంపాడులో అక్రమంగా మట్టి తరలింపు



**చేజర్ల మే 31ప్రభాతవార్త** చేజర్ల మండలం తూర్పు కంభంపాడు గ్రామంలో నల్ల వాగు సమీపాన ఎర్రగుంట ,కుంటపోరంబోకు ప్రభుత్వ భూమిలో జెసిబి సహాయంతో మట్టిని తరలిస్తున్న యనమదల గ్రామానికి చెందిన ఒ వ్యక్తి ఏలాంటి అనుమతులు లేకుండా ఇష్టాను సారంగా మట్టిన తరలిస్తున్న విష యం వెలుగులోకి వచ్చింది. 4,5 ట్రాక్టర్లు జెసిబి సహాయంతో అక్రమంగా మట్టిని తరలి స్తున్నారు.ఈ విషయాన్ని ఆగ్రామస్తులు మం డల తహసిల్దారు కె.గోపికృష్ణ దృష్టికి తీసు కొని వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవానలి విఆర్ఒని ఆదేశించారు. విఆర్ఓ సంబందిత స్థలానికి వెళ్ళకుండా తలారిని పంపించారు. తలారి వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేయకుండా వాటిని వదలి వేశారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈవిషయమై ఆర్‌డిఒ స్పందించి అక్రమంగా మట్టిని తరలించి వారిపైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## సంగం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదం



**సంగం మే 31 ప్రభాతవార్త** మండల కేంద్రమైన సంగంలోని విద్యుత్ సబ్‌స్టేషన్,ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలోని పొలాలలో ఉన్న జమ్ములో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు మంటల్ని అదుపులోకి తీసుకొని వచ్చారు. విద్యుత్ తీగలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలియజేశారు.

## కౌంటింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు

**కౌంటింగ్ విధులకు ప్రత్యక్షంగా 1100మంది,పరోక్షంగా 2500మంది**

**మూడంచెల పటిష్ట భద్రతతో కౌటింగ్ ప్రక్రియ**

**జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్**



నెల్లూరు అర్బన్,మే31,ప్రభాతవార్త సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లను ముమ్మరంగా చేపడుతున్న జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ హరినారాయ ణన్ పేర్కొన్నారు.శుక్రవారం సాయంత్రం జూన్ 4వ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో చేపడుతున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించారు.తొలుత ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు.స్ట్రాంగ్ రూములను పర్యవేక్షిస్తున్న కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు.కౌటింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.జడ్పీ హైస్కూల్లో పార్కింగ్ సైన్ బోర్డులు,బ్యారికేడ్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.ఎట్టి పరిస్థితుల్లో కూడా సెల్ ఫోన్లు అనుమతించవద్దని పోలీస్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌటింగ్ శరవేగంగా ఏర్పాటు చేపడుతున్నట్లు చెప్పారు.కౌటింగ్ కేంద్రం వద్ద మూడంచెల పటిష్ట భద్రతతో పాటు కౌటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతతో పాటు కౌంటింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.కేంద్రాల్లోకి కేవలం అభ్యర్థులు,చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు,గుర్తింపు పాసులు కలిగిన పాత్రికేయులకు మాత్రమే సెల్ ఫోన్లును వారికి కేటాయించిన పరిధి వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి కేవలం అభ్యర్థులు,రిటర్నింగ్ అధికారులకు మాత్రమే సెల్‌ఫోన్లు అనుమతి ఉంటుందని,మిగిలిన ఎవ్వరికీ అనుమతి లేదన్నారు.కౌటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరూ తమ సెల్‌ఫోన్‌లను కౌటింగ్ కేంద్రం బయట,ముందు ఏర్పాటు చేసిన సెల్ఫోన్ డిపాజిట్ కేంద్రంలో భద్రపరుచుకోవాలని, అభ్యర్థులు,చీఫ్ ఏజెంట్లు,కౌంటింగ్ కేంద్రంలోపల ఏర్పాటు చేసిన పబ్లిక్ రిప్రజెంటేటివ్ రూమ్‌లో ఫోన్లు భద్రపరుచుకోవాలన్నారు.అలాగే మీడియా వారు కేంద్రం నుండి మాత్రమే ఫోన్లు వాడుకోవాలన్నారు.కౌటింగ్ విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ మంచినీరు,భోజన వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు. సజావుగా కౌటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్,నెల్లూరు సిటీ,కోవూరు,కందుకూరు,నెల్లూరు రూరల్,ఆత్మకూరు ,కావలి రిటర్నింగ్ అధికారులు వికాస్,సేదుమాధవన్,విద్యాధరి,మలోల,మధులత,శీనానాయక్,స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్,మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## ఇంటి వద్దకే పింఛన్ పంపిణీకి ఏర్పాట్లు

**సచివాలయ సిబ్బందిచే జూన్ 1వ తేదీ నుండి 5వ తేదీలో పంపిణీ**
**పింఛన్దారులు ఎవరు గ్రామ అవార్డు సచివాలయానికి వెళ్లొద్దు**
**బ్యాంకులకు వెళ్లే డ్రా చేసుకోగలరు**
**బ్యాంకుల వద్ద పింఛన్దారులకు అన్ని సదుపాయాల ఏర్పాట్లు**
**జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డిఆర్డిఏపిడి సాంబశివారెడ్డి**



**నెల్లూరు అర్బన్,మే31,ప్రభాతవార్త** జూన్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్ వచ్చేలా ఏర్పాట్లు చేశామని డిఆర్డిఏ పిడి సాంబశివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.పింఛన్దారులు ఎవరు గ్రామ సచివాలయాలకు గానీ,ప్రభుత్వ కార్యాలయాలకు గాని ఎక్కడికి వెళ్ళరాదని,విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వ సూచనలు మేరకు జూన్ నెలకి అందాల్సిన పింఛను సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపధ్యంలో,ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకుల ప్రకారం జూన్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు పింఛన్ కార్యక్రమం పంపిణీ జరుగుతుందని తెలిపారు.మే నెలకు సంబంధించి 3,14,422పింఛన్లను మంజూరైనందున అందులో ఇంటింటి పంపిణీకి సంబంధించి 85,951డిబిటి ద్వారా 2,28471పింఛన్లను మంజూరు కాబడి పంపిణీ చేయాల్సి ఉందని, డోర్ టు డోర్‌కు సంబంధించి గ్రామఅవార్డు సచివాలయంకు సంబంధించి ఇంటి వద్దనే జూన్ 1వ తేదీ నుండి 5వ తేదీ లోపు పంపిణీ చేయాలని తెలిపారు.డిబిటికి సంబంధించి పింఛను దారుల ఆధార్ నెంబర్ లింక్ అకౌంట్ జూన్ 1వ తేదీన వారి ఖాతాల్లో జమచేయబడుతుందని తెలిపారు. పింఛన్దారులు వారి అవసరతను బట్టి సంబంధిత బ్యాంక్ బ్రాంచ్‌కి వెళ్లి డ్రా చేసుకోవాలని సూచించారు.బ్యాంక్ వద్ద పింఛన్ దారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు.గ్రామ సచివాలయంకు,ప్రభుత్వ కార్యాలయాలకు పింఛన్లు తీసుకోవడానికి వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు.

## పుస్తక పఠనం ద్వారా ప్రపంచలోని అన్ని విషయాలపై అవగాహన



**రాపూరు,మే31ప్రభాతవార్త** ప్రతి నిత్యం పుస్తకాలు,పత్రికలు చదవడం ద్వారా ప్రపంచలో జరిగే అన్ని విషయాలపై అవగాహన కలుగుతుందని గోనుపల్లి గ్రామ రెవెన్యూ అధికారి ఇండ్ల రమణయ్య తెలిపారు. గ్రంధాలయ వారోత్సవాలలోబాగంగా శుక్రవారం రాపూరులోని గ్రంధాలయంలో ఆయన విద్యార్థులకు పుస్తకలు,దినపత్రికలు చదవడం ద్వారాచేకూరే ప్రయోజనాలను వివరించారు. ప్రతి విద్యార్థి పుస్తకాలు,పత్రికలు చదివి విజ్ఞానాన్ని పెంపోందించుకోవాలనికోరారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారిని జె. ధనమ్మ, సహాయకుడు కె. వెంకటేశ్వర్లు,పలువురు పాఠకులు ,విద్యార్థులు తదితరులున్నారు.

## వార్తకు స్పందన రాపూరులో పేరుకుపోయిన చెత్త తొలగింపు



**రాపూరు,మే31ప్రభాతవార్త** రాపూరులో పేరుకుపోయిన చెత్త..పట్టించుకోని పంచాయితీ అధికారులు,పాలకులు అని వార్త దినపత్రికలోవచ్చిన వార్తకు స్పందించిన రాపూరు పంచాయితీ అధికారులు రాపూరులోని రామాలయం,పెద్ద పీర్ల ఛావిడి వద్దరోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పంచాయితీ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు ఈ ప్రాంతలోపర్యటించి పారిశుధ్య సిబ్బందిచే చెత్తను తొలగించి దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించారు. దీంతో ఈ ప్రాంతప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పత్రికలో వార్త వచ్చిన వెంటనే స్పందించిన అధికారులు ఇక్కడ వున్న చెత్తకుండీలో పేరుకుపోయిన చెత్తను కూడా తొలగించాలని కోరుతున్నారు.

## అనుమతులు లేకుండానే అడ్మిషన్లు ప్రారంభించిన శ్రీచైతన్య

**-ప్రభుత్వ నిబంధనలకు తిలోధికాలు**
**-ఉన్నతాధికారులకు ఫిర్యాధులు ఇచ్చినా స్పందన శూన్యం**
**-కార్పోరేటిజం ను అడ్డుకోకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు**
**-అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి**



నెల్లూరు,మే31 ప్రభాతవార్త-విద్య ప్రభుత్వ నిబందలను పూర్తిగా తుంగలో తొక్కి, అనుమతులు లేకుండానే శ్రీచైతన్య గ్రూప్స్ నగరంతోపాటూ జిలాల్లో ఒకే సారి ఐదు నూతన శాఖలను ఏర్పాటు చేసి, అడ్మిషన్లను ప్రారంభించారని ఆంధ్రప్రదేశ్‌ప్రయివేట ,అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్‌లు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక విజయ మమాల్‌గేట్ సెంటర్‌లోని శ్రీనేతాజీ పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నిబందనలను పూర్తిగా పాటించకుండా శ్రీచైతన్య గ్రూప్స్ పాటశాలలు నగరంలోని పార్ధసారధి నగర్‌లో సిబిఎస్సీ పాఠశాల, మైపాడురోడ్డులో, ధనలక్ష్మీపురం ముత్తుకూరు రోడులో, మినర్వహోటల్ వద్ద, పొదలకూరు రోడ్డులో ఇలా ఐదు ప్రాంతాల్లో నూతన పాఠశాలలను ఏర్పాటుచేయటం జరుగుతుందన్నారు. గతంలో కూడా ఇదే విద్యాసంస్థ అనేక పాఠశాలలను అనుమతులు లేకుండానే నిర్వహించటం జరిగిందన్నారు. అ అంశంపై ఇప్పటికే ఆయా పాఠశాలల వాస్తవ పరిస్థితి, బిల్డింగుల నిర్మాణం, అడ్మిషన్ల ప్రక్రియ, ఫీజుల వివరాలు జిల్లా ఉన్నతాధికారులతో పాటూ జిల్లా విద్యాశాఖ అధికారులకు, మండల విద్యాశాఖ అధికారులకు కూడా ఇవ్వటం జరిగిందన్నారు.అయినా వారి నుండి తమకు సరైన స్పందన రాలేదని, శ్రీచైతన్య యాజమాన్యం మాత్రం ఓంటెద్దు పొకడలతో బిల్డింగ్ నిర్మాణాన్ని పూర్తి చేసిందని దుయ్యబట్టారు. ఇలా ఇబ్బుడు ముబ్బడిగా పాఠ శాలలను శ్రీచైతన్య సంస్థ ఏర్పాటుచేయటం ద్వారా బడ్జెట్ ప్రయివేట్ పాఠశాలలు పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాగే మరి కొన్ని ప్రాంతాల్లో చిన్న చిన్న పాఠశాలలను మూసివేసే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం అపుసా ్మ నగర ఉపాధ్యక్షులు వెంకటాద్రి మాట్లాడుతు ఒక ప్రాంతంలో ఉండే పాఠశాలకు 1 కిలోమీటరు దూరంలో మరో ప్రయివేట్ పాఠశాల ఏర్పాటుచేయకూడదని, ఓలింపియాడ్,టెక్నో, ఈ టెక్నో ఇలా వివిధ పేరల్లో అడి ్మషన్లు చేయకూడదన్నారు. అలాగే బిల్డింగ్ కు అనుమతులు కూడా లేవని ఆరోపించారు. వీ టన్నింటిపై జిల్లా విద్యాశాఖ అధికారులను ఇప్పటికే పలుమార్లు కలిసి విన్నవించటం జరిగిందని అయినా ఫలితం శూన్యమన్నారు. ప్రభుత్వ జీఓ నెంబర్ 1ని పూర్తిగా తుంగలో తోక్కి శ్రీచైతన్య యాజమాన్యం అడ్మిషన్లు చేస్తుందని, దీనిపై తాము ఇప్పటికే నాయస్థానంను ఆశ్రయంచటం జరిగిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీచైతన యాజమాన్యం మెసపూరిత మాటలను నమ్మి అడి ్మషన్లు తీసుకోవద్దని, అలా తీసుకుంటే వారి వారి విద్యార్థుల భవిష్యత్ న్యాయస్థానం ఆదేశాల తరువాత అగమ్య గోచరంగా తయారౌతుందని స్పష్టంచేశారు. నిబందలను ఉల్లంగించి అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిస్తున్న శ్రీచైతన్య యాజమాన్యంపై తక్షణం చర్యలు తీసుకుని తమ బడ్జెట్ పాఠశాలలను కాపావాలని, లేకుంటే తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళణ చేపడతామని హెచ్చరించారు.అపుస్మా జిల్లా కార్యదర్శి వెంకటరాయ్య, నర అధ్యక్షులు రామ్మోహ న్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, రమేష్, లక్ష్మీరెడ్డి, శ్రీధర్, అవినాష్‌రెడ్డి తదితర పాఠశాలల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు నగరంతోపాటూ నెల్లూరు రూరల్ పరిధిలో శ్రీచైతన్య విద్యాసంస్థలు నిర్మిస్తున్న నూతన శాఖలపై తమకు ఇప్పటికే అనేక ఫిర్యాధులు అందాయని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు ప్రభాతవార్తకు తెలిపారు. ఆయా ఫిర్యాధులను పరిశీలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, పార్థసారధి నగర్‌లోని పాఠశాలకు ఓపెనింగ్ అనుమతులు లేవని ఆయన స్పష్టంచేశారు. అనుమతులు లేకుండా ఓపెనింగ్ చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని, అలాగే ఈ అంశంపై కొందరు న్యాయస్థానానికి సైతం వెళ్లారని, కోర్టు ఆదేశాల మేరకు తాము నడుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

**పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించిన జిల్లా ఎస్పీ**



**నెల్లూరు క్రైం, మే 31, ప్రభాతవార్త** పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా ఎస్పి ఆరీఫ్ హాఫీజ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించి, సిబ్బంది సమస్యలు తెలుసుకుంటూ అర్జీలను స్వయంగా స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. విధి నిర్వహణలో నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బంది సంక్షేమానికి నిత్యం కృషి చస్తామని ఎస్పి తెలిపారు. విధి నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వహించాలని, అనధికారికంగా గైర్హాజరు అవుతూ క్రమశిక్షణను ఉల్లం ఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. డిపిఓ పరిపాలన విభాగ అధికారులకు ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు తగు ఆదేశాలు, సూచనలు చేశారు. గ్రేడ్ ఇంక్రిమెంట్, బదిలీలు, సస్పెండ్ నుండి రిలీవ్, సర్వీసు సంబంధిత సమస్యలు, డిప్యూటేషన్, భద్రత, ఆరోగ్య భద్రత, హౌసింగ్ లోను, అనారోగ్యం కారణంగా బదలాయింపు సంబంధిత అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు అర్జీలు స్వీకరించారు. సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి, అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు అర్జీలు స్వీకరించారు. సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు రావల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి, అపరిష్కృంగా ఉన్న పనులను తక్షణమే పరిష్కారం నిమిత్తం, తగిన సూచనలు చేసి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

## కౌంటింగ్ రోజున చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

**బిట్రగుంట, మే 31 ప్రభాతవార్త** జూన్ 4వ తేదిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్ రెండు రోజుల పాటు అమలులో వుంటుందని బిట్రగుంట ఎస్ఐ భోజ్యా తెలిపారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలు నిర్వహించడం కానీ, బాణాసంచా పేల్చడం కానీ పూర్తిగా నిషేధమన్నారు. వీటిని ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ సమయం దగ్గర పడేకొద్ది పోలింగ్ సరళిపై వివిధ అంచనాల్లో వున్న అధికార, ఎన్డీఎ కూటమి నేతలు తీవ్ర ఉత్కంఠతకు గురవుతున్నారు. తమ అంచనాలు ఫలిస్తాయా లేదా తలకిందలవుతాయా అన్న సంశయంలో పడ్డారు. 1వ తేది సాయంత్రం అధికారికంగా ఎగ్జిట్ పోల్ ప్రకటించేంత వరకు కొత్త టెన్షన్ అయితే వారిలో కనపడుతుంది. ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు, కౌంటింగ్ ఫలితాలు సమానంగా వుంటాయా, లేదా తేడాలు వుంటాయా అని మల్లగుల్లాలు పడుతున్నారు. బూత్‌ల వారీగా తమ అంచనాలు తారుమారైతే పోటీ చేసిన అభ్యర్దులకు ఎలా సమాధానం చెప్పాలని తీవ్ర వత్తిళ్లకు గురవుతున్నారు. విజయావకాశాలు మా పార్టీకే, మా పార్టీకేనని బెట్టింగ్‌లు పెట్టుకుంటున్నారు. మరి విజయం ఎవరి వైపు వుంటుందో 4వ తేది వరకు వేచిచూడాల్సిందే.

## కావలి రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం కల్పించాలి



**కావలి, మే 31 ప్రభాతవార్త** కావలి రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని బిజెపి నేతలు కోరారు. శుక్రవారం కావలి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు బిజెపి నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి కావలి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడారు. కావలి రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. గతంలో పలుమార్లు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని బిజెపి కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. లిఫ్ట్ ఏర్పాటుకు రైల్వే శాఖ నిధులు మంజూరు చేసినా లిఫ్ట్ ఏర్పాటు చేయడంలో జాప్యం చేయడం జరుగుతుందన్నారు. రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ లేకపోవడం వల్ల వయోవృద్దులు, వికలాంగులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్ధం వెంటనే లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రైల్వే స్టేషన్ ముందు భాగాన పరిశుభ్రతపై దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే సూపరింటెండెంట్‌ను కోరడం జరిగిందన్నారు. రైల్వే స్టేషన్‌లో వెంటనే లిఫ్ట్ ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభిస్తామని స్టేషన్ సూపరింటెండెంట్ చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి మంద కిరణ్‌కుమార్, కురాకుల సవీంద్ర, పట్టణ ఉపాధ్యక్షులు కోడూరు మురళికృష్ణ, పసుపులేటి సుధాకర్, పట్టణ కార్యదర్శి లింగాల ప్రసాద్‌రెడ్డి, మైనార్టీ మోర్చ పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్, యువమోర్చ నాయకులు దేవండ్ల రాకేష్, గుడిపల్లి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ చేసిన జనవిజ్ఞాన వేదిక కావలి పట్టణ శాఖ



**కావలి రూరల్, మే 31 ప్రభాతవార్త** జనవిజ్ఞాన వేదిక కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద గుప్త దాత సహకారంతో శుక్రవారం సహజ పానీయమైన మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా కావలి పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ వద్ద ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎండలు తీవ్రంగా వుంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా వుండి అత్యవసరమైన పనులకు మాత్రమే బయటకు రావాలని తెలిపారు. ముఖ్యంగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, అంబలి, నిమ్మరసం తదితర సహజ పానీయాలు సేవించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, ఉపాధ్యక్షులు సి.కల్లయ్య, జిల్లా కార్యదర్శి పాపిశెట్టి జానకిరాం, సంయుక్త కార్యదర్శి శ్రీకర్ల వెంకయ్య, సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీసభ్యులు తాళ్ళూరు మాల్యాద్రి, కార్యవర్గ సభ్యులు యం.వి ఎన్.ప్రసాదరావు, వి.మల్లికార్జునరావు, మొగిలిశెట్టి జమున, ఎస్.రమణయ్య, గాదిరెడ్డి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో కార్డన్ సర్చ్ నిర్వహించిన సిఐ శ్రీనివాసరావు



కావలి రూరల్, మే 31 ప్రభాతవార్త కావలి పట్టణం పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ, పరిసర ప్రాంతాలలో కావలి రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కొండవీటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రతి ఇంటిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సిఐ కొండవీటి శ్రీనివాసరావు మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు కావలి డిఎస్పీ వెంకట రమణ పర్యవేక్షణలో పట్టణంలోని పలు ప్రాంతాలలో రానున్న ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకొని కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో తనిఖీలు చేయడం జరిగిందన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరికలు చేశారు. ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి రెండవ పట్టణ ఎస్ఐలు, ఎఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొగాకు వాడకం అనారోగ్యానికి మూలం



నెల్లూరు, మే 31, ప్రభాతవార్త - వైద్యం పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల అనారోగ్యం బారిన పడతారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లి పెంచలయ్య తెలిపారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పొగాకు పరిశ్రమ జోక్యం నుండి పిల్లలను రక్షించడం ఎలా అనే నినాదంతో అవగాహన ర్యాలీని పెంచలయ్య జండా ఊపి ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నివ్వాలని, పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నిషేధిస్తే ఆరోగ్య సమాజ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పొగాకు వాడకంతో అనేక వ్యాధులు వస్తాయని తెలియజేసారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో పొగాకు వలన కలిగే అనర్ధాల గోడపత్రికను పెంచలయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధీర్ కుమార్, ఎన్‌సిడి అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సేవాకు గుర్తింపు ఎన్టీఆర్ జాతీయ పురస్కారం



**నెల్లూరు, మే 31 ప్రభాతవార్త** సేవా రంగములో విశిష్ట సేవలను అందించి, సమాజ సేవలో నిత్య పాల్గొంటు ప్రజలకు అందుబాటులో ఉండి అధికారులు, నాయకులు వద్ద గుర్తింపు తెచ్చుకున్న ఆరుమూళ్ల మురళీకి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. హైదారాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకులు సందర్బంగా పలువురికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారాలను అందజేశారు. మండల పరిదిలోని చవటపాళెం గ్రామానికి చెందిన ఆరుమూళ్ల మురళీకి ఎన్టీఆర్ జాతీయ పురస్కారాని అవార్డును అందుకు న్నా రు. ప్రతి ఏడాది మురళీ 2013 నుంచి 2024 వరకు పలు అవార్డులను జిల్లా కలెక్టర్ చేతులు మీదగా అందుకున్నారు. దీంతో మురళీ స్నెహితులు పలువురు అధికారులు, నాయకులు ప్రత్యేక అబీనందనలు తెలిపారు.

## టొబాకో నిర్మూలన పై అవగాహన ర్యాలీ




**పొదలకూరు, మే 31, ప్రభాతవార్త** పొదలకూరు పట్టణంలో మహ్మదాపురం వైద్యాధికారి డాక్టర్ నరసింహరావు ఆధ్వర్యంలో ప్రపంచ టొబాకో నిర్మూలనా దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పొగాకు, తంబాకు, గుట్కా, పాన్ పరాగ్, ఇతర పొగాకు పదార్థాలను నమలడం వల్ల దవడ క్యాన్సర్, నోటి క్యాన్సర్, ప్రేగు క్యాన్సర్స్ వస్తుందని ప్రజలు అవగాహన కలిగి వీటిని నమలవద్దని వైద్యాధికారి పేర్కొన్నారు. సిగరెట్, బీడీలు లాంటివి తాగవద్దని తెలిపారు. ఈ ర్యాలీలో డాక్టర్ కిరణ్ రిషిత, డాక్టర్ పద్మావతి, డాక్టర్ మల్లికార్జున, ఆరోగ్య విస్తరణాధికారి టి. రవికుమార్, సీనియర్ సహాయకులు వాసుదేవరావు, ఆరోగ్య సహాయకులు ఎం. రాధా కుమారి, మిడ్లెవల్ హెల్త్ ప్రొవైడర్లు రఫీ, ప్రగతి, మునిచందన, సచివాలయం ఎఎన్ఎంలు హైమావతి, కృష్ణమ్మ, చిత్ర, అరుణ, ఎంఎల్‌హెచ్‌పి పెంచలమ్మ పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఎస్సై



**ఉలవపాడు, మే31, ప్రభాతవార్త** ఉలవపాడు పోలీసు స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని నిబం ధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉం టాయని ఉలవపాడు ఎస్సై బాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన బాజిరెడ్డి రానున్న 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగుతోందని ఈ నేపథ్యంలో ఉలవపాడు పోలీసు స్టేషన్ పరిధిలో ప్రజలు, ముఖ్యంగా యువత సంయమనంతో వ్యవహారించాలని, కుల, మత, వర్గ ప్రాంతాల పేరుతో వైష మ్యాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహారించడం చట్టరీత్యా నేరమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దాని ద్వారా యువతకు తమ ఉజ్వల భవిష్యత్తుకు విఘాతం కలగుతుందని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వివాదస్పద వ్యాఖ్యలకు వివాదాలకు దూరంగా ఉండాలని అన్నారు. దీనిని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని దాని ద్వారా మీరు చదువుతున్న చదు వుకున్న చదువులు నిరూపయోగమై ప్రభుత్వ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయి భవిష్యత్తు నిర్వీర్యం అయి జీవితం అగమ్యఘోచరంగా మారుతుందని అన్నారు. దీనిని గమనంలో ఉంచుకుని సమాచార మాధ్య మాల్లో సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన చర్యలకు గురవుతారని హెచ్చరించారు.

## నిరుపేదలకు బిర్యానీ ప్యాకెట్లు అందజేసిన హ్యాపీ సేవా సంస్థ



**కావలి రూరల్, మే 31 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం ఆముదాలదిన్నె గిరిజనులకు శుక్రవారం హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ ఘనీబాషా ఆధ్వర్యంలో బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఘనీబాషా మాట్లాడుతూ కావలి పట్టణ ఇందిరానగర్‌కు చెందిన షేక్ షాఫహద్ ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగంలో చేరిన సందర్బంగా నిరుపేదలకు ఒక్క పూట అయినా మంచి భోజనం పెట్టాలనే సదుద్దేశంతో హ్యాపీ సేవా సంస్థ ద్వారా నిరుపేదలకు అన్నదానం చేయడం చాలా సంతోషంగా వుందన్నారు. ఆయనను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో హ్యాపీ సేవా సంస్థ సభ్యులు సయ్యద్ నౌషద్ ఆలీ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం



ఉదయగిరి, మే31, ప్రభాతవార్తఉదయగిరి మండలం దాసరిపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో నేలటూరు గ్రామానికి చెందిన రమణయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సిఐ గిరిబాబు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు స్వగ్రామం నేలటూరు నుండి వ్యక్తిగత పనుల నిమిత్తం కొండాపురం వెళ్తుడంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

## తెలుగు పద్యాలలో ఉన్న భావన అద్భుతం



**బుచ్చి మే 31 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం లోని శ్రీగోపాలకృష్ణయ్యస్కూల్‌లో జరిగిన పద్యపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు పద్యవ భావం చక్కగా చెప్పిన విద్యార్థులను అతిథులు అబినందించారు. వేసవి సెలవలలో విద్యార్దులు ఎండలకు ఇండ్లలోనే ఉండి తెలుగుపద్యాలను ఉచ్చరణ దోషం లేకుండా నేర్చుకొని వాట్సాప్ చూడకుండా 28 మంది విద్యార్దులు పాల్గోన్నారని ,వీరిలో చక్కగా చెప్పిన వారికి బహుమతులు అందిచేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్, విశ్రాంతి హెడ్మాష్టర్ తిప్పావరజుల నరసింహామూర్తి, చేపూరి చలమయ్య, పణితి వెంకటరమణయ్య, పాఠశాల పూర్వ విద్యార్ది ప్రభుత్వ ఉపాధ్యాయులు లక్ష్మీరెడ్డి, విద్యార్దులు తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## ముగిసిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, హిందీ తరగతులు



కావలి రూరల్, మే 31 ప్రభాతవార్త కావలి పట్టణం తుఫాన్‌నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, హిందీ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. సంయుక్త సేవా సంస్థ సభ్యులు డాక్టర్ కె.ఆనంద్‌కుమార్, యం.వి.యన్.ప్రసాదరావు, అళహరి రామకృష్ణ, యం.క్రిష్ణకిశోర్‌ల సహకారంతో నెల రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, హిందీ కోచింగ్ తరగతులు ముగిశాయి. శిక్షణ పొందిన విద్యార్థులకు సంయుక్త సేవా సంస్థ సభ్యుల సహకారంతో నోట్‌బుక్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత యం.వి.యన్.ప్రసాదరావుకు, శిక్షణ ఇచ్చిన గురువులు మార్కస్, రుబీనాలకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర సన్మానం చేశారు. అనంతరం దాతలు మాట్లాడారు. ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువుగా వున్నందున పిల్లలు బయట తిరగకుండా వుండేందుకు సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్, హిందీ కోచింగ్ క్లాసులు నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లలు ఈ కార్యక్రమాన్ని ఎంతో చక్కగా వినియోగించుకోవడం సంతోషంగా వుందన్నారు. పిల్లలకు చక్కగా కోచింగ్ ఇచ్చిన గురువులు మార్కస్, రుబీనాలను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ అధ్యక్షులు సురేంద్రను ప్రత్యేకంగా అభినందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్ల సురేంద్ర మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్ పెట్టేందుకు సహాయం కోరిన వెంటనే స్పందించి సహాయం అందజేసిన దాతలు డాక్టర్ కె.ఆనంద్‌కుమార్, యం.వి.యన్.ప్రసాదరావు, అళహరి రామకృష్ణ, యం.క్రిష్టకిశోర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యార్థులకు నోట్‌బుక్స్ వితరణ చేసిన తమ సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు. వచ్చే సంవత్సరం కూడా అవకాశం వుంటే స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

## కౌంటింగ్‌కు రెడీ అవుతున్న రాజకీయ నాయకులు

**మనుబోలు, మే31, ప్రభాతవార్త** ఎట్టకేలకు తేదీలు దగ్గరకు వచ్చేస్తున్నాయి. మరో నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని సర్వేపల్లి నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు, ఎవరు అధికారంలోకి వచ్చే సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో సర్వేపల్లి నియోజకవర్గం వైకాపా అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తెలుగుదేశం అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మధ్య నువ్వే నేనా అన్న పోటీ జరిగింది. వీరిద్దరిలో ఎవరు గెలుస్తారన్న ఉత్కంఠ ఇరు పార్టీల్లో నెలకొంది. ఈ ప్రయత్నంలో ఎన్నికలు జరిగిన తరువాత రాజకీయ నాయకులు కౌంటింగ్‌కు సిద్దపడుతున్నారు. గుడులు, గోపురాలు, టూర్లు ముగించుకుని కౌంటింగ్‌ను పరిశీలించేందుకు సిద్దపడుతున్నారు. ఒక్కో అభ్యర్థి నుండి ఏజెంట్ పాస్ తీసుకుని ప్రధాన పార్టీ అభ్యర్థుల అనుచరులు ఇండిపెండెంట్ అభ్యర్థులు కౌంటింగ్‌కు నెల్లూరు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీకి 4వ తేదీ వెళ్లేందుకు తలమునకలయ్యారు. ఇప్పటికే సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో రిటర్నింగ్ అధికారులు పాస్‌లను కేటాయించారు. స్థానిక తహశీల్దార్ చిరంజీవి క్షణం తీరిక లేకుండా కౌంటింగ్ పనిలో బిజీగా ఉన్నాయి. మరో నాలుగు రోజులు దగ్గరపడటంతో ఇరు పార్టీల నేతల్లో ఉత్కంఠత పెరిగింది. కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైదరాబాద్ నుండి నెల్లూరు వస్తుండగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బెంగుళూరు నుంచి శనివారం నెల్లూరుకు రానున్నారు. మరో పక్క బెట్టింగ్‌లు హోరెత్తిస్తున్నాయి. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లలో తలమునకలయ్యారు.

## ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు



**ఉలవపాడు, మే31, ప్రభాతవార్త** రోహిణి కార్తెలో రోళ్ల బద్దలవుతాయనేది నానుడి. అందుకు అనుగుణంగానే ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలే నమోదవుతున్నా తీవ్రత మాత్రం ఎక్కువగా ఉంది. సూర్యుడి భగభగలకు తోడు వేడిగాలులు వీస్తుండటంతో ఉక్కపోతతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఉదయం 8 గంటల నుండి ఎండల మండిపోతుండటంతో సాయంత్రం 7గంటల తర్వాతే బయటకు వస్తున్నారు. ఇంట్లో ఉన్నప్పటికి ఏసీలు, కూలర్లు వేసుకుంటేనే ఉండగలుగుతున్నారు. పశ్చిమ, వాయువ్య దిశల నుంచి రాష్ట్రంలోకి గాలులు వీస్తుండటం వల్ల శుక్రవారం సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యింది. దీంతో కూడా వేడిగాలుల తీవ్రత, సూర్యుడి భగభగలు కొనసాగనున్నాయి. ఇళ్లపై ఉన్న ట్యాంకుల్లో ఉన్న నీరు సైతం వేడెక్కడంతో జనం అవస్థలు వర్ణణాతీతం.

**వేడి గాలులతో సెగ:** ఉదయం 8గంటల నుంచి సూర్యుడు నిప్పులు చెరుగుతుండటంతో వాతావరణం త్వరగా వేడెక్కుతోంది. దీనికి తోడువేడిగాలులు ఉండడంతో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలే ఉన్నప్పటికీ తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. వేడిగాలులతో సెగ వస్తుండటంతో జనం బయట ఉండలేకపోతున్నారు. బయట తిరిగేవారు, తరచూ శీతలపానియాలు తాగుతూ సేదతీరుతున్నారు. కొంత దూరం ప్రయాణించగానే చెట్టు వస్తే కొంత సేపు ఆగుదామన్న ఆత్రుత వాహనదారుల్లో కనిపిస్తోంది. నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల్లోనూ మధ్యా హ్నం ఒంటిగంట నుంచి నాలుగు గంటల వరకు జన సంచారం పెద్దగా ఉండటం లేదు. అత్యవసరమైతే తప్ప జనం బయటకు రావడం లేదు. ఎండ వేడి కంటే వేడిగాలుల తీవ్రత వల్ల ఉక్కపోతతో శరీరంలో నీటి శాతం తగ్గిపోయి తరచూ పానీయాలు తీసుకోవాల్సి వస్తోంది. మే నెల ప్రారంభంలో కొంత వర్షాలు వచ్చి ఎండలు తగ్గగా మళ్లీ క్రమంగా ఎండలు పెరిగి ఉక్కపోత పెరిగింది. వృద్దులు, చిన్నారులు అవ్థలు పడుతున్నారు. విద్యుత్తు సరఫరాకు నిమిషాల సమయం అంతరాయం కలిగినా తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. శీతల కార్యాల ధరలు విపరీతంగా పెరిగాయి. కొబ్బరిబొండం ఒకటి రూ.40లు అమ్ముతున్నారు. జ్యూస్లు రూ .50 నుంచి రూ.60లు తీసుకుంటున్నారు. విద్యుత్ వాడకం పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. కొన్ని ట్రిప్ అవుతున్నాయి.

## పుష్కల పోషకాహారంతోనే విద్యార్ధులకు ఆరోగ్యం



**జలదంకి, మే31, ప్రభాతవార్త:** నిర్దారించిన మెనులో కచ్చితత్వ పాటించి పుష్కల పోషకాహారం అందించడంవల్ల విద్యార్దులకు సంపుర్ణ ఆరోగ్యం సమకూరుతుందని శిక్షకుడు తిరుపతిస్వామి తెలియజేశాడు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నభోజన నిర్వాహకులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మెను దాని లక్ష్యం వివరించారు. ప్రభుత్వం విద్యార్ధుల ఎదుగుదల ఆరోగ్యంవంటివి దృష్టిలో వుంచుకొని భోజనపథకాన్ని అత్యంత పకడ్బందీగా చేపట్టిందని కావున నిర్వా హకులు ఎక్కడా నిర్లక్ష్యానికి తావివ్వకుండ మసలు కోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా కళ్ళకు కట్టినట్లు కిచిడి, ఆకుకూరలు, రాగిజావ వంటి వాటిని వివరించారు. దాని ద్వారా పిల్లలకు ఐరన్ క్రొవ్వులు, మానసిక పరిపక్వత ఎదుగుదల తదితరాలు చేకూరతాయన్నారు. అదేక్రమంలో వంటగదిని పరిశుభ్రంగా వుంచుకోవడం కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఈ శిక్షనలో ఎంఇఒలు శ్రీధర్, నాగేశ్వరరావు, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించరాదు



**కోవూరు, మే 31ప్రభాతవార్త :** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరిగే కౌంటింగ్ సందర్భంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే అటువంటి వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కోవూరు సీఐ టీవీ శ్రీనివాసరావు అన్నారు. కోవూరులోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించడం జరిగిందని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మూడు వీడియో కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ అనంతరం ఎక్కడా కూడా ర్యాలీలు చేయడం కానీ, బాణాసంచా కాల్చడం కానీ చేయరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా రౌడీ షీట్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యానాలు పెట్టడం ఇతరత్రా నిబంధనలకు విరుద్ధంగా పెట్టే విషయాలపై సంబంధిత అడ్మిన్‌లకు ఇప్పటికే సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎవరైనా ఎన్నికల నియమాలకు విరుద్ధంగా గ్రూపుల్లో పోస్టులు పెడితే సంబంధిత అడ్మిన్‌లే బాధ్య వహించాల్సి ఉంటుందన్నారు. పోటీల మాదిరిగానే ఈ కౌంటింగ్ ఫలితాలను టీవీల ముందు కూర్చొని ఆనందిచాలే తప్ప బయటకు వచ్చి సంబరాలు చేయడం ఘర్షణ వాతావరణం సృష్టించడం మంచి పద్దతి కాదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రంగనాథ్ గౌడ్ ఉన్నారు.

## ఇన్‌చార్జి ఏపీఎంగా రవిశంకర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



**కోవూరు, మే 31ప్రభాతవార్త :** కోవూరు సంఘమిత్ర కార్యాలయంలో ఇందుకూరుపేటలో ఏపీఎంగా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డి శుక్రవారం కోవూరు ఇన్‌చార్జి ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఏపీఎంగా పనిచేస్తున్న వెంకటస్వామిని ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన కేసులో జిల్లా డీఆర్‌డీఏ అధికారులు సస్పెండ్ చేయడం విధితమే.

## నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, మే 31ప్రభాతవార్త :** వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు సమాజంలో వస్తున్న నూతన అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ లైబ్రేరియన్ శంకరయ్య పేర్కొన్నారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులకు శుక్రవారం ఉపాధ్యాయులు వి. భాస్కర్‌రావు పేపర్ క్రాఫ్టింగ్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కోవూరు గ్రంథాలయ బాండాగారి జె. సురేంద్రరెడ్డి మాట్లాడుతూ చిన్నారులు ఈ వేసవి సమయంలో తమ కాలాన్ని వృథా చేసుకోకుండా ఈ విజ్ఞాన శిబిరంలో పెద్దలు చెప్పే అంశాలను పూర్తిగా అవగాహన చేసుకుని ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## సర్వేపల్లి ఓట్ల లెక్కింపు 21 రౌండ్లు ఏర్పాట్లు పూర్తి చేశాం ఆర్వో చిన్న ఓబులేసు



**నెల్లూరు, మే 31 ప్రభాతవార్త :** సర్వేపల్లి నియోజక వర్గంలో జూన్ 4న నెల్లూరు రూరల్ మండలంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళశాలలో జరిగే కౌంటింగ్ ఏర్పాట్లలను పూర్తి చేయడం జరిగిందిని మెత్తం ఐదు మండలల 284పోలింగ్ కేంద్రాల్లో 2,32,034,ఓటర్లకు ఉండగా 1,94,618 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని కౌంటింగ్ సంబందించి 14,టేబుళ్లను ఏర్పాటు చేయగా రెండు టేబుళ్ల పోస్టల్ బ్యాలేట్ మెత్తం 16 టేబుల్‌ను ఏర్పాటు చేశామని సర్వేపల్లి రిటర్నింగ్ అదికారి చిన్న ఓబులేసు తెలిపారు. ఉదయం 5 గంటలకు అదికారులు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవలన్నారు.8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు ప్రారంభవం జరుగుతుందన్నారు.104 మంది ఏజేంట్లులకు పాస్‌లను జారి చేశామని,ఒక్క సారి ఏజేంట్లు లోపలికి వచ్చిన తరువాత కౌంటింగ్ అయ్యే వరకు కంద్రములో ఉండాలన్నారు.ప్రతి ఏ జేంట్ తప్పని సరిగా పాస్ తగిలించుకోవాలని తెలిపారు. ప్రతి టేబుల్‌కు ఒక సూపర్వేజర్‌ను నియమించడం జరిగిందన్నారు.క్రమశిక్షణగా కౌంటింగ్ కేంద్రములో ఎన్నికల నింబందనలు పాటించాలన్నారు.మూడు అంచెలా భద్రత నడుమ ఎన్నికలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## సుబ్రమణ్యంని సన్మానించిన హంస నేతలు



**నెల్లూరు, మే 31, ప్రభాతవార్త - వైద్యం :** వైద్య ఆరోగ్య శాఖలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నందు ఆర్ఎంఓగా మంచిగా సేవలందించి అందరి మన్ననలు పొంది, ఈ రోజు రిటైర్మెంట్ కాబోతున్న డాక్టర్ జి. సుబ్రమణ్యంని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు కరోనా టైంలో మంచిగా సేవలందించిన డక్కిలి సుబ్బారావు డ్రైవర్ని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు గౌరవ అధ్యక్షులు డాక్టర్ వై. వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ కమల కిరణ్‌లు ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి శేషగిరి రావు, జిల్లా ట్రెజరర్ మజారుల్లా, జిల్లా వైస్ ప్రెసిడెంట్ నాగరాజమ్మ, వైస్ ప్రెసిడెంట్ మురళి, జాయింట్ సెక్రటరీ ఉమా, నెల్లూరు రూరల్ తాలుకా సెక్రటరీ సుజాత, ట్రెజరర్ అశోక్, జాయింట్ సెక్రటరీ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య ఒక చిరు ఉద్యోగికి చాలా గొప్పగా రిటైర్మెంట్ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు, త్వరితగతిన పెన్షన్ డబ్బులు అందిస్తామని చెప్పడం గొప్ప శుభపరిణామమని హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు అన్నారు. డాక్టర్ సుబ్రమణ్యం ఆర్ఎంఓగా సుబ్బారావు గానీ నిజాయితీగా సేవలందించడంతో పాటు, అందరికీ ఆదర్శంగా విధులు నిర్వర్తించడం జరిగిందని అన్నారు. రిటైర్మెంట్ అయిన అధికారులను ఉద్యోగులను కుటుంబ సభ్యులు కూడా గౌరవప్రదంగా చూడాలన్నారు.

## పొగాకు బలవుతున్న యువత




**నెల్లూరు, మే 31, ప్రభాతవార్త - వైద్యం :** 18 నుంచి 24 సంవత్సరాల లోపు వయసున్న యువత పొగాకు ఉత్పత్తుల వినియోగానికి బానిసలై బలవుతున్నారని ప్రముఖ చర్మవ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ బి. కృష్ణమూర్తి అన్నారు. వేదాయపాలెం, అలెన్ రాయల్ దంత వైద్యశాల సమావేశ మందిరం నందు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, అలెన్ రాయల్ దంత వైద్యశాల సంయుక్త ఆద్వర్యంలో శుక్రవారం ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి పొగాకు విముక్తి ఆందోళన అనే కరపత్రం విడుదల చేసి మాట్లాడుతూ పొగతాగడం, పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల శరీరంలో అనేక జబ్బులు వస్తాయని అన్నారు. ప్రస్తుతం పొగతాగే వారిలోనే 30 శాతం గుండె జబ్బులు వస్తున్నాయని, అలాగే కిడ్నీ, ఊపిరితిత్తుల బారిన పడే ప్రమాదం ఉందని, పొగాకు ఉత్పత్తుల్లో ఉండే రసాయనాల వలన మెదడు, గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ తగ్గుతుందని, గుట్కా, ఖైనీ, పొగాకు నములుట వలన నోటి, శ్వాసకోశ క్యాన్సర్లు వస్తున్నాయని, వీటివల్ల ఆయుష్ క్షీణిస్తుందని, గర్భస్రావాలు, అంగవైకల్యం గల పిల్లల పుట్టుటకు, నరాల బలహీనతకి, నపుంసకత్వానికి దారితీస్తుందని, అధిక రక్తపోటు, గుండెపోటు, నిద్రలేమి, అల్సర్, అసిడిటీ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని, కంటిచూపు, రుచిని గ్రహించే శక్తిని కోల్పోవడం జరుగుతుందని తెలిపారు. ప్రముఖ కాస్మోటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ విద్య మాట్లాడుతూ పొగతాగడం వల్ల, పొగాకు ఉత్పత్తులను నమలడం వలన దంతాలకు ఉండే చిగుళ్ళు కరిగిపోయి, రంగు మారిపోతున్నాయని అన్నారు. నాలుక, గొంతు, నోరు, అన్నవాహిక ప్రాంతాల్లో క్యాన్సరు వ్యాపిస్తుందని ఆమె అన్నారు. అనంతరం జిల్లా పిహెచ్‌పి నాయకులు డాక్టర్ విద్య, డాక్టర్ కృష్ణమూర్తిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిహెచ్‌పి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పిహెచ్‌పి నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ఎం. శ్రీధర్ రావు, బి. శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరి పార్టీ కేంద్రాలయానికి తరలి వెళ్లిన ఉదయగిరి తెలుగుదేశం పార్టీ నాయకులు



**ఉదయగిరి,మే31,ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలోని మండల కేంద్రమైన ఉదయగిరి నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు ఎలక్షన్ కౌటింగ్ ఏజెంట్లు శిక్షణ నిమిత్తం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా తెలుగుదేశంపార్టీ నాయకులు తుమ్మల కిరణ్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ నెల్లూరులోని ప్రియదర్శిని కాలేజీలో జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొరకు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ఉదయగిరి మండలానికి చెందిన కంభం విజయరామిరెడ్డి, తుమ్మల కిరణ్ తదితరులు పాల్గొనడానికి వచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎన్నికల కమిషన్ నిర్ధేశించిన విధివిధానాలను సలహాలను,సూచనలను పాటిస్తూ ఎన్నికల కౌటింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా తమకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## ప్రాధమిక ఆరోగ్యకేంద్రం తనీఖి చేసిన జిల్లాధికారి



**సీతారామపురం మే 31 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సీతారామపురంలో స్ధానిక ప్రాధమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా ఎస్‌జిటి నోడల్ అధికారి డాక్టర్ పి.ఎల్ దయాకర్‌రావు ఆఖస్మికంగా తనీఖి చేశారు.ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలోని రికార్డులు,పార్మస్ గది ,ల్యాబ్‌లను క్షుణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు పిహెచ్‌సిలోని పార్మసిలో రికార్డులు సరిగాలేవని అదే విధంగా ల్యాబ్ నందు సీరియల్ నెంబర్ అబ్రాకట్‌లను పొందుపరచాలని అన్నారు.పిహెచ్‌సి పరిధిలోని హైరిన్ వ్యాధి గ్రస్తుల పట్ల శ్రద్ద వహిస్తు వారం రోజుల ముందు నుండే వారికి అందించాల్సిన వైద్యం రికార్డులలో నమోదు చేసుకోవాలని మాతా శిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యంగా ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కరకమైన కాన్పులు చేస్తు గర్బవతులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహిస్తు ఆరోగ్య సూచనలను తెలపాల న్నారు. అదే విధంగా ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో రికార్డుల నిర్వహణ సరిగాలేదని రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలనిమెడికల్ అధికారికి సూచించారు.మరో నెలలో ఆఖస్మికంగా మరోసారి తనీఖి చేస్తానని ఆయన తెలిపారు.ఆరోగ్య కేంద్రం సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి ఎ .స్వప్న,సిబ్బంది మజీద్,రసూల్,కృష్ణమ్మ,తదితరులున్నారు.

## కౌంటింగ్ ప్రక్రియలో ప్రత్యేక జాగ్రత్తలు



**కోవూరు, మే 31ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గానికి సంబంధించిన జూన్ 4వ తేది జరగనున్న కౌంటింగ్‌కు సంబంధించి విధులు నిర్వహించే అధికారులు సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ అన్నారు. కోవూరులోని ఆర్వో కార్యాలయంలో ఈ మేరకు శుక్రవారం ఆయన కౌంటింగ్‌లో విధులు నిర్వహించే అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను ఎన్నికల కమిషన్ సూచించిన మేరకు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎక్కడా కూడా సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన 4వ తేది జరగనున్న కౌంటింగ్‌కు సంబంధించిన ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు విజయశ్రీ, రమేష్‌బాబు, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

## వైభవంగా హనుమత్ గాయత్రి హోమం



**కోవూరు, మే 31ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రాత:కాలమునే ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజు స్వామి ఆధ్వర్యంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హనుమత్ గాయత్రి హోమాన్ని కన్నులపండువగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా గుంటూరులో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు జయప్రకాష్ స్వామి, సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## వైభవంగా పూలంగి సేవ



**కోవూరు, మే 31ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో పంచామృత స్తపన, సహస్ర నామార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కలిచేటి శివకుమార్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - కొనసాగుతున్న హనుమాన్ చాలీసా

శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా గత 40 రోజుల నుంచి సాగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం శుక్రవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమై శనివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగేలా భక్త బృందం ఇప్పటికే అన్ని ఏర్పాటు చేపట్టారు. ఈ హనుమాన్ చాలీసా పారాయణంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నిరాటంకంగా కొనసాగించారు. శనివారం హనుమజ్జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఉదయం 8 గంటలకు స్వామివారికి 11 రకాల పండ్ల రసాలతో మహాభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాల లోపు పిల్లలకు పెద్ది ప్రభావతి జ్ఞాపకార్థం వారి కుమారుడు పెద్ది మారుతీ నాగార్జున, సత్యవతిల ఆధ్వర్యంలో వెండి డాలర్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.

## శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ప్రారంభమైన హనుమజ్జయంతి ఉత్సవాలు



**కావలి, మే 31 ప్రభాతవార్త :** కావలి పట్టణం రామమూర్తిపేటలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో వేంచేసి వున్న శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి. విశేష పూజలు,పల్లకీ సేవ, సుందరకాండ పారాయణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన అర్చకులు డి.శ్రీనివాసాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భక్తులకు గోపి, తిరుపతిరెడ్డి, రామమోహన్‌లు సేవలందించారు.

## భోజన నిర్వాహకులతో సమీక్ష



**వింజమూరు,మే31,ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల విద్యాశాఖాధికారి-2 మధుసూధన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి మండలంలోని 48ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు హాజరయ్యారు. ఈసమావేశంలో ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు .కావున భోజన నిర్వాహకులు రుచి ,శుచికరంగా ప్రతి రోజూ మెనూ ప్రకారం విద్యార్థుల సంఖ్యను బట్టి తగిన మోతాదులో భోజనం తయారుచేసి అందించాలన్నారు.ప్రతి రోజు పిల్లలకు ఏం పెడుతున్నారో తల్లిదండ్రుల సమావేశంలో తెలియజేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ మౌనిక , సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

## ప్రాణంతాకమైన వ్యాధులకు పొగాకే మూలకారణం




**వింజమూరు,మే31,ప్రభాతవార్త :** ప్రస్తుత సమాజంలో ప్రాణాంతమైన వ్యాధులకు పొగాకే మూలకారణమని ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, విశ్రాంత డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మాశిలామణి పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు ఉత్పత్తుల నిషేద దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ గుట్కా, పాన్‌మసాలా లో ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు నికోటిన్ ఉండడం వలన వివిధ రకాల అనారోగ్య సమస్యలు కలుగుతున్నాయన్నారు. పొగాకు ఉత్పత్తి వినియోగంతో అధికశాతం మంది నోటివ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సిగరెట్లు, బీడీలకంటే ఎక్కువగా పొగ రహిత పొగాకుకే ప్రజలు ఆకర్షితులవుతున్నారని పలు సర్వేల్లో తేలిందన్నారు. పొగతాగడం వలన ఏటా 12లక్షల మంది , పొగాకు నమలడం వలన 3.5లక్షల మంది చనిపోతున్నారని గ్లోబల్ అడల్ట్ సర్వేలో తేలిందన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు అలవాటును మాని ప్రాణాంతక వ్యాధులకు గురికాకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## టెర్మినేట్ ఉత్తర్వులు రద్దు హర్షం వ్యక్తం చేసిన హంస



**నెల్లూరు, మే 31, ప్రభాతవార్త - వైద్యం :** పీహెచ్‌సిలలో కాన్పులు జరగలేదని స్టాఫ్ నర్సులను టెర్మినేట్ చేసిన సంఘటనలో, తమ సంఘం ఆందోళనను అర్థం చేసుకున్న వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆ ఉత్తర్వులను ఉపసంహా రించుకోవడంతో హంస రాష్ట్ర జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేజర్ల సుధాకర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో రాష్ట్ర వైద్య ఆరో గ్యశాఖ కార్యాలయం వద్ద విలేకరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో ఒక్క కాన్పు కూడా జరగలేదని, మాణిక్యం, సువర్చల, మేరీమమతలు అనే ముగ్గురు స్టాఫ్ నర్సులను టెర్మినేట్ చేస్తూ ఉత్తర్వు లు ఇచ్చారన్నారు. కాన్పులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చడంతో గర్భిణీలు కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రి కాన్పు లు చేయించుకుంటున్నారన్నారు. పట్టణాలకు దగ్గరలో ఉన్న పీహెచ్సిలో మాత్రమే ఇలా జరుగు తుంద న్నారు. అందువల్లనే పీహెచ్‌సిల్లో ఇలా జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని తమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్‌తో చెప్పి ప్రిన్సిపల్ సెక్రటరీ క్షేత్రస్థాయిలో జరిగే విషయాలను వివరించడం జరిగిందని తెలియజేసారు. దాంతో టెర్మినేట్ ఉత్తర్వులను రద్దు చేయడం జరిగిందని వివరించాడు. ఈ సమావేశంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి కమల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు రాపురులో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



**రాపూరు,మే31ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిం చనున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో క్షేత్రపాలకుడైన అంజనేయ స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకం,ఆకుపూజ,ఉత్సవం నిర్వహించన న్నారు. రాపూరులోని శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు,శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయం ప్రాంగణంలోవున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి మూలమూర్తికి ఉదయం అభిషేకం, పూజలు నిర్వహించను న్నారు. మద్యాహ్నం పెద్ద ఎత్తున అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపారు. రాపూరులోనిరామాలయం ప్రాంగణంలో వున్న అంజనేయ స్వామికి ఉదయం ప్రత్యేకంగా అభిషేకాలు,ఆకుపూజా, సాయంత్రంసింధూరాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చక స్వామి కారంచేటి రామనాధేశ్వర శర్మ తెలిపారు.

## వృద్దుల ఆశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ



**నెల్లూరు,మే31 ప్రభాతవార్త-విద్య :** స్మైల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నాబా షా, కంరుద్దీన్ తల్లి పారీజాన్ 41 వర్ధం తిని పుర స్కరించుకుని నగరంలోని స్థానిక గాయ త్రి నగర్‌లో సాయి సధన్ వృద్దుల ఆశ్రమం లోని వృద్ధు లకు నెల రోజులకు సరిపడ నిత్యావ సర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ముఖ్యఅతిధిగా వాకర్స్ ఇంట ర్నేష నల్ సీనియర్ సభ్యులు నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. తమ వాకర్స్ సభ్యులు వారి తల్లి 41వ వర్ధంతిని గుర్తుపెట్టుకుని వృద్దులకు సేవ చేయటం సంతోషంగా ఉందన్నారు. అందరూ తల్లిదండ్రులను మరిచిపోకూదదని తెలిపారు. ఇంత మంది పెద్దలకు సహాయ సహకారాలు అందించటం గర్వకారణమని పేర్కొన్నారు. నిర్వాహకులు మాట్లాడుతు తమ తల్లిగారి వర్ధంతిని పురస్కరించుకుని నేడు వృద్దులకు బియ్యం, సరుకులు, పండ్లు అందజేయటం జరిగిందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సేవా కార్యక్రమాలను మరిన్ని చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యులు బలరాం నాయుడు, పసుపులేటి యానాదయ్య, ఆశ్రమ నిర్వాహకులు తాడిపత్రి లీలా తదితరులు పాల్గొన్నారు.

## రాపూరు విద్యార్ధినీకి చంద్రా కంప్యూటర్స్ వారిచే ల్యాప్‌టాప్



**రాపూరు,మే31ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2024 సంవత్సరంలో జరిగినపదవ తరగతిలో ప్రధమ స్థానంలో పాసైన ఆవుల అర్చనకు నెల్లూరులోని ఆర్టీసి బస్టాండ్ వద్ద వున్న చంద్రకంప్యూటర్స్ వారు ల్యాప్‌టాప్ ఆందజేశారు. అర్చన పదవ తరగతి పలితాలలో 570 మార్కులు సాధించి మండలంలోనిప్రభుత్వ పాఠశాలలో ప్రధమ స్థానంలో నిలిచింది. పదవతరగతిలో గణితంలో 100కి 100, సోషల్‌లో 100కి100,సైన్స్‌లో 100కి 99 మార్కులు సాధించింది. దీంతో చంద్ర కంప్యూటర్స్ వారు ఆమెకు ఈ బహుమతినిఆందజేసి ఇంటర్‌లో మరింతగా ప్రతిభ చూపి ఉన్నత స్థానానికి చేరుకోవాలని చంద్ర కంప్యూటర్స్ యాజమన్యంవిద్యార్దినీకి సూచించారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన వారికి ప్రోత్సహంగా మంచి ల్యాప్‌టాప్‌ను ఆందజేసిన చంద్ర కంప్యూటర్స్ యాజమాన్యానికి విద్యార్ధీనీ,తల్లితండ్రులు,రాపూరు మండల వాసులు అభినందనలు తెలిపారు.

